



మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్



ప్రలోభాలతో ప్రసన్నం

- వాలంటీర్లకు అధికార పార్టీ తాయిలాలు
- ఓటర్ల వివరాలు సేకరించేలా ఒప్పందం

ప్రలోభాలతో ప్రసన్నం చేసుకునేందుకు అధికార పార్టీ వైసిపి నాయకులు పలు రకాలుగా ముందుకు వెళ్తున్నారు. వాలంటీర్లకు అధికార పార్టీ తరపున తాయి లాలు అందిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో సహకరించాలని, ఓటర్ల వివరాలు సేకరించాలని కోరుతున్నారు. ఓటర్లను బుజ్జగించో.. భయపెట్టో వైసిపికి ఓటు వేసేలా చూడాలని ఒత్తిడి తెస్తున్నారు. ఎన్నికలు ముగిసేలోపు విడతల వారీగా ఒక్కో వాలంటీరుకు రూ.20 వేలు పంచేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది.

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

అధికార పార్టీ అయిన వైసిపి నాయకులు ప్రలోభాలకు తెరతీశారు. తాయిలాలతో పలు రకాల ప్రజలను ప్రసన్నం చేసుకోవాల ని చూస్తున్నారు. అందులో భాగంగా వాలంటీర్లకు తాయిలాలను అందిస్తున్నారు. ఓటర్లను బుజ్జగించో.. భయపెట్టో వైసిపికి ఓటు వేసేలా చూడాలని ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే వాలంటీర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. వారు ఎంపిక చేసిన ఓటర్లకే డబ్బు, వస్తువులు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఇలాఖా డోన్ నియోజకవర్గంలో వాలంటీర్లకు తాయిలాలను పంపిణీ చేశారు. నియోజకవర్గ కేంద్రంతో పాటు మండలాల్లో సమావేశాలు నిర్వహించి వాలంటీర్లకు, చేతి గడియారాలు, స్వీటు బాక్సులు పంపిణీ చేశారు. డోన్ మండలంలో 328 మంది, బేతంచర్లలో 466 మందికి, ప్యాపిలిలో 363 మంది వాలంటీర్లకు రూ.2 వేల విలువ చేసే చేతి గడియారాలు, అర కిలో స్వీటు బాక్సు అందించారు. నంద్యాల పట్టణంలో వాలంటీర్లు ఇంటింటికీ తిరుగుతూ వైసిపికి ఓటు వేయాలని, లేకుంటే పథకాలు ఆగిపోతాయని భయపెడుతున్నారు. దీని కోసం వాలంటీర్లకు వార్డు ఇన్‌ఛార్జీలు, కౌన్సిలర్ల ఆధ్వర్యంలో ఒక్కో వాలంటీరుకు రూ.3 వేల నుంచి రూ.5 వేల నగదు పంచుతున్నట్లు సమాచారం. గత పది రోజులుగా ఈ వ్యవహారాన్ని సాగిస్తున్నారు. ఎన్నికలు ముగిసేలోపు విడతల వారీగా ఒక్కో వాలంటీరుకు రూ.20 వేలు పంచేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. డబ్బు అందుకున్న వాలంటీర్లు తమ పరిధిలోని 50 కుటుంబాల్లో ఎంత మందికి ఓట్లు ఉన్నాయి, వారు ఏ పార్టీ వైపు మొగ్గుచూపుతున్నారు వంటి వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం. వైసిపికి వ్యతిరేకంగా ఉన్న ఓటర్లకు వాలంటీర్ల ద్వారా తాయిలాలు అందజేసి వారిని తమపైపు తిప్పుకొనేందుకు అధికార పార్టీ నాయకులు చర్యలు చేపట్టినట్లు వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని 13 సచివాలయాల పరిధిలో దాదాపు 230 మంది వాలంటీర్లు పని చేస్తున్నారు. 50 మంది వాలంటీర్లను ఒక బృందంగా విభజించి ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించారు. ఒక్కో వాలంటీరుకు మూడు దఫాలుగా రూ.15 వేలు ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. మూడు పోలింగ్ కేంద్రాలను ఒక గ్రూపుగా ఎంపిక చేసి వాలంటీర్లకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. ఇలా పలు ప్రాంతాల్లో అధికార పార్టీ నాయకులు వాలంటీర్లకు తాయిలాల ఆశ చూపి వారికి అనుకూలంగా పని చేయించుకుంటుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బిజెపి, దాని మిత్రపక్షాలను ఓడించాలి

- సిఐటియు నాయకుల పిలుపు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కార్మిక వర్గ హక్కులను హరించే బిజెపి దాని మిత్రపక్షమైన టిడిపి, జనసేనలను, నిరంకుశ వైసిపిని ఓడించాలని, నిరంతరం ప్రజల పక్షాన పోరాడే సిపిఎంను గెలిపించాలని ఎపి వేర్హౌస్ హమాలీ యూనియన్ జనరల్ బాడీ సమావేశం కర్నూలు వేర్ హౌస్ లో జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు వేర్ హౌస్ హమాలి యూనియన్ అధ్యక్షులు విజయుడు అధ్యక్షత వహించారు. ఎపి రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్ దేశాయ్, రామాంజనేయులు సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు నగరకార్యదర్శి టి.రాముడులు కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ దేశంలో సంపాదన సృష్టించేది కార్మికులే, ఈ దేశ అభివృద్ధికి పాటుపడేది కార్మికులే ఈ దేశ భవిష్యత్తును నిర్ణయించేది కార్మికులే, శ్రమశక్తి లేకపోతే ఈ దేశం అంధకారంగా మారుతుందన్నారు. అంతటిప్రాముఖ్యతకలిగిన కార్మికులను చులకనగా చిన్నచూపు చూస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను 2024 ఎన్నికల్లో కార్మిక వర్గం తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీప్రభుత్వం కార్మికులహక్కులను హరించే విధంగా కార్మికులకు ఉన్న 44 లేబర్ కోడ్లను కుదించి నాలుగు కోడ్లుగా చేసి యజమానులకు అనుకూలంగా చట్టాలను చేస్తున్నదన్నారు. కార్మికులసంక్షేమం గురించి పట్టించుకోకుండా కార్పొరేట్ శక్తులకు దాసోహం అంటూ రూ.లక్షల కోట్ల సబ్సిడీని ఇస్తూ, దేశ సంపదను కార్పొరేట్లకుదోచిపెడుతుందన్నారు. ప్రభుత్వ రంగాలన్నింటినీ ప్రైవేటుపరం చేస్తున్నదన్నారు. అన్నదమ్ముల వలె కలిసి ఉన్న భారతదేశ ప్రజలను కులం పేరుతో మతంపేరుతో విద్వేషాలను రెచ్చగొడుతూ ఐక్యంగాఉన్న ప్రజలను విచ్ఛిన్నం చేస్తుందన్నారు. ప్రపంచ దేశాల కంటే ఎంతో ప్రాముఖ్యత కలిగిన భారత రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసి మనువాదసిద్ధాంతాన్ని తీసుకురావాలని చూస్తున్నదన్నారు. ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటే ప్రజలను ఆదుకోకుండా ప్రజల పైన భారాలు వేయడమే పనిగా పెట్టుకుని నిత్యవసర ధరలు విపరీతంగాపెంచి,పెట్రోలు, డీజిల్, గ్యాస్, కరెంటు చార్జీలు, ఇంటి పన్నులు, చెత్త పన్ను, రైల్వే చార్జీలు, మొదలగు భారాలు వేస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నదన్నారు. బిజెపి చేస్తున్న ప్రజావ్యతిరేకచట్టాలకుమద్దతుగా పార్లమెంటులో వైసిపి, టిడిపి ఎంపీలు బిజెపికి అనుకూలంగా ఓట్లు వేస్తున్నాయన్నారు. ఆ విధంగా ఓట్లు వేయడం ద్వారా ప్రజా వ్యతిరేక చట్టాలు పార్లమెంటు నుండి బయటికి వస్తున్నాయని, ఈ విధంగా ప్రజలకు వ్యతిరేకంగా చేస్తున్న బిజెపిని, దానినిబలపరుస్తున్న నిరంకుశ వైసిపి,అవకాశవాద టిడిపి, జనసేన పార్టీలను చిత్తుచిత్తుగాఓడించాలని కోరారు. కర్నూల్ నగరం బాగా అభివృద్ధి చెందాలంటే, ప్రజలకు మెరుగైన సేవలు అందాలంటే, కార్మికుల హక్కులు రక్షించాలంటే, సిపిఎంను కర్నూలులో గెలవడం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. సిపిఎం అభ్యర్థి గెలుపుకు ఆర్థిక సహకారంచేస్తూ, ప్రజల మధ్యకు వెళ్లి ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. వేర్ హౌస్ హమాలి యూనియన్ కార్యదర్శి ఎం.జయన్న, ట్రెజరర్ ఎం.మల్లికార్జున, చెన్నయ్య, ఏసు, రాజు, శేఖర్, నాగరాజు , మద్దిలేటి, మునేంద్ర, ఊహిన్ చంటి, చిరంజీవి, మధు, సుధాకర్ పాల్గొన్నారు. సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ అన్ని యూనియన్ల ఆఫీస్ బేరర్స్ సమావేశం సుర్జీత్ భవన్‌లో సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్ దేశాయ్, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పిఎస్.రాధా కృష్ణ, ఎండి. అంజిబాబు, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి మారేళ్ల విజయ రామాంజనేయులు, సిఐటియు నగర ఉపాధ్యక్షులు రాజశేఖర్, రాజగోపాల్ మాట్లాడారు. బిజెపి దానిని బలపరిచే టిడిపి, జనసేన, వైసిపిలను ఓడించాలని కోరారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

- జెసి నారపురెడ్డి మౌర్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనల ప్రకారం ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని పాణ్యం నియోజకవర్గ ఇఆర్ఒ, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సాధారణ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో, సంబంధిత అధికారులతో పాణ్యం నియోజకవర్గ ఇఆర్ఒ, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సమీక్ష నిర్వహించారు. అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థి రూ.40 లక్షలకు మించి ఖర్చు చేయరాదన్నారు. అభ్యర్థులు ప్రచార నిమిత్తం వినియోగించే బ్యానర్లు, జెండాలు, టోపీలు, వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించే అడ్వర్‌టైజ్‌మెంట్స్‌లకు సంబంధించిన రేటింగ్ కార్డు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. సంబంధిత రేటింగ్ కార్డు ప్రకారమే తొలుతగా అనుమతి తీసుకొని ప్రచారాలు నిర్వహించుకోవాలన్నా రు. పార్టీ అభ్యర్థులు పర్మిషన్ తీసుకున్న ప్రకారమే ఖర్చు చేయాలన్నారు. పార్టీల అభ్యర్థులు సభలు, సమావేశాలు నిర్వహించాలనుకుంటే 48 గంటల ముందే అనుమతులు తీసుకొని సభలు నిర్వహించుకోవాలన్నారు. ఎంసిసి, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో వ్యూయింగ్ టీం, తదితర టీంలు నియోజకవర్గంలో పర్యవేక్షిస్తుంటారన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు ఆన్‌లైన్ వివిధ రకాల పర్మిషన్ల కొరకు ఎలా దరఖాస్తు చేసుకోవాలనే విషయంపై పిపిటి ద్వారా రాజకీయ పార్టీ ప్రతినిధులకు తెలిపారు. ఈ సమావేశంలో మండల తహశీల్దార్లు ఓర్వకల్లు – నటరాజ్, పాణ్యం – ఫణి కుమార్, గడివేముల తహశీల్దార్ , టిడిపి తరపున ప్రశాంత్ రెడ్డి, వైసిపి తరపున సురేష్ ,సిపిఎం తరపున రామకృష్ణ, బిఎస్‌పి తరపున చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి - క్రిష్ణగిరి

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, పోలింగ్‌లో పాల్గొని మన జిల్లాలో అత్యధిక పోలింగ్ శాతం నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ జి.సృజన సూచించారు. మంగళవారం కటారుకొండ, ఆలం కొండ గ్రామాల్లో ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌పి జి.కృష్ణ కాంత్, ఆర్‌డిఒ రాజ్యలక్ష్మి, పత్తికొండ డివిజన్ డిఎస్‌పి పి.శ్రీనివాస్ రెడ్డి లు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ మే 13 న జరుగుతుందని, ఇందులో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నా రు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ పేరు చెక్ చేసుకోవాలని, ఓటరు జాబితాలో పేరు లేని వారు ఏప్రిల్ 15 వరకు నమోదు చేసుకోవడానికి గడువు ఉందని అన్నారు. జిల్లాలోని ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని, మన జిల్లాలో అత్యధిక పోలింగ్ శాతం నమోదయ్యేలా అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరు ఇతరులకు ఓటు ప్రాముఖ్యతపై వివరించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఎస్‌పి జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ ఎన్నికలలో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా దానికి జిల్లా పోలీసు యంత్రాంగం సహకారం ఎల్లవేళలా ఉంటుందని జిల్లా ఎస్‌పి జి. కృష్ణకాంత్ అన్నారు. గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా, శాంతిభద్రతలను కాపాడడానికి కేంద్ర సాయుధ బలగాల పోలీసులను ఏర్పాటు చేశామన్నారు. పత్తికొండ ఆర్‌డిఒ రాజ్యలక్ష్మి ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్, క్రిష్ణగిరి ఎమ్మార్వో అనురాధ, సిఐ సురేష్ కుమార్ ,రెడ్డి ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, మండల సర్వేర్ సుబ్బయ్య, విఆర్ఒ వెంకటేశ్వర్లు, విష్ణువర్ధన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుంకన్న సంబంధిత అధికారులు, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన



ఆటో డ్రైవర్ల అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న పివి రామలింగేశ్వర్

ఆటో డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన సందర్భంగా 2024 ఎన్నికల నియమాలు పై మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయం పాత కౌన్సిల్ హాలులో ఆటో డ్రైవర్లకు అవగాహన సమావేశాన్ని అదనపు కమిషనర్ పివి. రామలింగేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా తమ ఆటోల పైన గాని ,లోపల గాని స్టిక్కర్లు, ఫోటోలు, బ్యానర్లు ఏవి కూడా కలిగి ఉండడం చట్ట వ్యతిరేకమని తెలిపారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కేసులను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లందరూ తప్పనిసరిగా ఎన్నికల నియమాలను పాటిస్తూ నగరపాలక సంస్థకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఇన్చార్జి డిసిపి సంధ్య, ఎన్నికల ప్రవర్తన నియమావళి అధికారి ఎపిసి రంగస్వామి, ఎసిసి శశిలత, ట్రాఫిక్ పోలీస్ ఎఎస్ఐ వహీద్ పాల్గొన్నారు.



టిడిపి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-మద్దికేర

టిడిపి తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టిడిపి నాయకులు గడ్డం రామాంజనేయులు అన్నారు. మండల కేంద్రమైన మద్దికేరలో బాబుషూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ, పథకాలను వివరిస్తూ ప్రజలకు వివరించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాల ద్వారా చదువుతున్న విద్యార్థులకు ప్రతి ఏటా రూ.15000, నిరుద్యోగ భృతి రూ.3000 అందిస్తామన్నారు. ప్రతి రైతుకు ఏటా రూ.20,000 ఆర్థిక సాయం, ప్రతి మహిళకు ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తామన్నారు. ప్రతి మహిళకు నేలకు రూ.1500, మహిళలకు ఉచితపస్ ప్రయాణం అందిస్తామన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ కెఇ. శ్యాం బాబును గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మద్దికేర పట్టణ అధ్యక్షుడు, గడ్డం రామాంజనేయులు, సాయి నగర్ బాషా, చంద్ర నాగరాజు పాల్గొన్నారు.

బ్యానర్లు, ఫ్లెక్సీల తొలగింపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్


కర్నూలు నగరంలో ఎన్నికల కోడ్ రావడంతో నగరంలో ప్రధాన కూడళ్లలో కట్టిన బ్యానర్లు ఫ్లెక్సీలు అన్ని నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం వారు తొలగించే పని చేపట్టారు. నగర కమిషనర్ ఎ. భార్గవ తేజ ఆదేశాల మేరకు నగరంలో ఎక్కడ ఏ రాజకీయ నాయకులు ఫ్లెక్సీ ఉన్న వాల్ పోస్టర్ ఉన్న వాటిని తొలగించాలని తెలిపారు. అలాగే ప్రధాన కోడళ్లలో రాజకీయ నాయకుల విగ్రహాలకు కూడా ముసుగులు వేశారు. ప్రైవేటు వైద్యశాలల్లో ఎక్కడ కూడా వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ స్టిక్కర్లు గాని బోర్డులు గాని ఉంటే వాటిని కూడా తొలగించేశారు. అన్ని చేసినా పాఠశాల విద్యార్థుల పుస్తకాలపై జగన్ బొమ్మ ఉండటాన్ని చెక్కిలు (ఘట్టాలు)పై ఉన్న బొమ్మలను మాత్రం తొలగించలేకపోయారు. సచివాలయాల ద్వారా ప్రజల మరణ ధ్రువీకరణ పత్రాల పై కూడా జగన్ బొమ్మను ముద్రించారు. వాటిని కూడా తీసివేసి సాధారణ పేపర్లో ప్రభుత్వ సింబల్‌తో ఉన్నటువంటి సర్టిఫికెట్లను మాత్రమే ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఆఫీసుల్లో రాజకీయ నాయకుల బొమ్మలన్నింటిని తొలగించేశారు. క్యాలెండర్లలో అడ్వర్‌టైజ్‌మెంట్లు ఇచ్చిన వాటిని కూడా తీసేయమని ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల నియమాలని అతిక్రమించి ఎవరైనా ఏ పార్టీ వారైనా కార్యకలాపాలు నిర్వహించినట్లయితే నగరపాలక సంస్థ కార్యాలయంలో ఫిర్యాదుల సెల్‌ను ఏర్పాటు చేశామని, వెంటనే ఆ ఫిర్యాదుల సెల్ నెంబర్ కు ఫోన్ చేసి తెలపాలన్నారు. వాట్సాప్‌లో కూడా రాజకీయాలకు సంబంధించినటువంటి ఎలాంటి పదాలను కానీ అభ్యర్థిని గెలిపించాలని ఇటువంటి పోస్టులు పెట్టిన వాటిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికలు అయిపోయే వరకు ఎన్నికల నియమాలని ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని ఎన్నికల అధికారి ఏ భార్గవ తేజ తెలిపారు.



ప్రశాంత ఎన్నికలే లక్ష్యం : ఎస్‌పి

ప్రజాశక్తి -కర్నూలు క్రైమ్

ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాలలో పోలీసులు కవాతు నిర్వహించారని కర్నూలు జిల్లా ఎస్‌పి జి.కృష్ణ కాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున కేంద్ర సాయుధ బలగాలతో కలిసి జిల్లా పోలీసులు ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు, ఎటువంటి అల్లర్లు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా, శాంతిభద్రతలను కాపాడడానికి కేంద్ర సాయుధ బలగాల పోలీసులతో కవాతు నిర్వహించారన్నారు.ఎన్నికలలో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా దానికి జిల్లా పోలీసు యంత్రాంగం సహకారం ఎల్లవేళలా ఉంటుందని ఎస్‌పి తెలిపారు. ఎస్‌పి ఆదేశాల మేరకు మంగళవారం జిల్లాలోని కర్నూలు, పత్తి కొండ, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ లలోని పలు ప్రాంతాలలో కేంద్ర సాయిధ బలగాలైన "సశస్త్ర సీమా బల్" సిబ్బందితో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. కర్నూలు రెండవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని జిల్లా పోలీసు కార్యాలయం , అంబేద్కర్ విగ్రహం ఓల్డ్ టౌన్, హెడ్ పోస్టు ఆఫీస్, ఓల్డ్ కంట్రోల్ రూమ్, కిడ్స్ వరల్డ్, రాజ్ విహార్, బంగారు పేట , ఆర్ఎస్ రోడ్డు, ఎస్‌బిఐ సర్కిల్, ఇన్ కమ్ ట్యాక్స్ ఆఫీసు మీదుగా తిరిగి పోలీసు స్టేషన్ వరకు కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. కర్నూలు టు టౌన్ సిఐ ఇంథియాజ్ భాషా , ఎస్సైలు, పోలీసులు పాల్గొన్నారు. కర్నూలు మూడవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని సి.క్యాంప్, కర్నూలు మెడికల్ కాలేజ్, బుధవార పేట ప్రాంతాలలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. కర్నూలు మూడవ పట్టణ సిఐ మురళీధర్ రెడ్డి, ఎస్ఐలు వెంకట సురేష్, సిద్దయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. పత్తికొండ యుపిఎస్ పరిధిలోని పులికొండ గ్రామంలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. పత్తికొండ యుపిఎస్ సిఐ శ్రీనివాసులు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఎమ్మిగనూరు యుపిఎస్ పరిధిలోని వెంకటాపురం , మిలిటరీ కాలనీ, అన్నమయ్య సర్కిల్ లలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎమ్మిగనూరు యుపిఎస్ సీఐ మధుసుధన్ రావు , ఎస్ఐలు , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కర్నూలు నగరంలో పోలీసు కవాతు



మాట్లాడుతున్న వైస్ ఛాన్సలర్ సుధీర్ ప్రేమ్ కుమార్

ప్రమాణాలు పాటించాల్సిందే

వైస్ ఛాన్సలర్ సుధీర్ ప్రేమ్ కుమార్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

బిఇడి కళాశాలలో ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాల్సిందేనని వైస్ ఛాన్సలర్ సుధీర్ ప్రేమ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం రాయలసీమ వర్సిటీలోని సమావేశ భవనంలో బిఇడి కళాశాల యాజమాన్యాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ బిఇడి కళాశాలలో తప్పనిసరిగా ప్రభుత్వాన్ని నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలి అన్నారు. కళాశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఇతర వర్సిటీలో జరుగుతున్న బోధన పద్ధతులపై కూడా అధ్యయనం చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడ ఎలాంటి లోపాలు లేకుండా తరగతులను పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రెక్టర్ ఎన్టికె నాయక్ సి డి సి డిన్ కృష్ణారెడ్డి రిజిస్ట్రార్ నాగుల అంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్రిష్ణగిరి ఎస్ఐని సస్పెండ్ చేయాలి : సిపిఐ

పజాశక్తి-పత్తికొండ : అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తున్న క్రిష్ణగిరి ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ,మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్ డిమాండ్ చేశారు. మంగళవారం పత్తికొండ సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రిష్ణగిరి ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి అధికార పార్టీ నాయకులకు తొత్తుగా మారి గ్రామాలలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎస్.హెచ్.ఎర్రగుడి గ్రామంలో చాకలి నరసింహుడు సిపిఐలో ఉండకూడదని, వైసిపిలో ఉండాలంటూ అమాయకుడైన అధికార పార్టీ నాయకులు ఇంటికి పిలిపించుకుని విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచారన్నారు. దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని లిఖితపూర్వకంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే, విచారణ చేసి న్యాయం చేయాలన్న నర్సింహుడును ఎస్ఐ అధికార పార్టీ నాయకుల ఎదురుగా పోలీస్ స్టేషన్ లోనే దాడి చేసి, అసభ్యకరంగా మాట్లాడి కించపరిచారన్నారు. కేసు విషయంలో చాకలి నరసింహుడుకు న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ కు వెళ్లిన సిపిఐ నాయకులు, న్యాయవాది రవి మోహన్, మండల కార్యదర్శి ఖలీల్ పై అధికార పార్టీ నాయకులు స్టేషన్ లోనే దురుసుగా ప్రవర్తించి నా నా బూతులు తిట్టి దాడి చేయడానికి ప్రయత్నించినా ఎస్ఐ తమకేమీ పట్టనట్లు వ్యవహరించారన్నారు. క్రిష్ణగిరి మండలంలో ఎమ్మెల్యే అనుచరులు భూకబ్జాలకు పాల్పడుతూ, అమాయకుల భూములను తమపేరు మీద ఎక్కించుకొని బెదిరింపులకు పాల్పడు తున్నారన్నారు. క్రిష్ణగిరి ఎస్ఐ అరాచకాల ను జిల్లా ఎన్నికల అధికారి, ఎస్పిదృష్టికి తీసుకెళ్తామన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

టిడిపితోనే రాష్ట్ర భవిష్యత్తు

- బీవీ జయనాగేశ్వరరెడ్డి

- కౌన్సిలర్ రంగస్వామిగౌడ్ ఆధ్వర్యంలో 'శంఖారావం'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్రంలో టిడిపితోనే భవిష్యత్తు ఉంటుందని, రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి భావితరాలకు దారి చూపాలని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బీవీ.జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని 6వ వార్డులో కౌన్సిలర్ రంగస్వామి గౌడ్ ఆధ్వర్యంలో శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీవీ.జయనాగేశ్వరరెడ్డికి వార్డు సభ్యులు బాణసంచా పేల్చి, పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేసి వివరించారు. శంఖారావం కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకు వెళ్లి వారికి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీవీ మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేదలకు పింఛను రూ.3 వేలు ఇస్తామని చెప్పి విడతల వారీగా ఇవ్వడం మోసమన్నారు. ఇలాంటి మోసపూరిత ప్రభుత్వాన్ని గద్దె దించాలని కోరారు. టిడిపి హయాంలోనే పింఛను రూ.200 నుంచి రూ.2 వేలు చేసినట్లు తెలిపారు. మళ్లీ టిడిపి అధికారంలోకి రాగానే రూ.4 వేలు ఇస్తామన్నారు. చంద్రబాబు నాయుడును మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని, అందుకు అందరూ సహకరించాలని కోరారు. టిడిపి సీనియర్ నాయకులు సుందర్ రాజు, రామదాసు గౌడ్, కొండయ్య చౌదరి, షబ్బీర్, మల్లి, వార్డు సభ్యులు మిన్నెల్లా, నాగురు, శ్రీనివాసులు, గోవిందు, నాగరాజు, గోల్డ్ ఈరన్న, వీరేష్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, రాజు పాల్గొన్నారు.

రసవత్తరంగా సెపక్‌తక్రా పోటీలు

ప్రజాశక్తి - ఆదోని



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఆల్ ఇండియా అంతర్ విశ్వ విద్యాలయాల సెపక్ తక్రా పోటీలు మంగళవారం రసవత్త రంగా సాగాయి. ముఖ్య అతిథిగా కళాశాల కరస్పాండెంట్ దైవాదీనం రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని అభినందనలు తెలిపారు. కళాశాల యాజమాన్యం ప్రశాంత్ గాంధీ, వైస్ ప్రిన్సిపల్ సురేష్, ఎర్రిస్వామి, కంబి రెడ్డి, రాయలసీమ విశ్వవిద్యాలయం ఫిజికల్ డైరెక్టర్లు శివ కిషోర్, మత్తయ్య, కల్యాణ్ కుమార్, చంద్ర శేఖర్‌లు పర్యవేక్షించారు. క్వడ్రెంట్ ఈవెంట్‌లో (నలుగురు సభ్యులతో ఆడేది) జరిగిన మ్యాచ్‌లో ఉత్కల్ యూనివర్సిటీపై గన్వానా యూనివర్సిటీ, మౌలానా ఆజాద్ జోద్‌పూర్ యూనివర్సిటీపై ఉస్మానియా యూనివర్సిటీ, శ్రీకుష్ణల్ దాస్ యూనివర్సిటీ, హనుమాన్ ఘర్‌పై ఆదికవి నన్నయ యూనివర్సిటీ, తెలంగాణ యూనివర్సిటీ నిజామాబాద్‌పై ఎపిజె అబ్దుల్ కలామ్ యూనివర్సిటీ, మాధవ్ యూనివర్సిటీ, పెండ్వరాపై కువెంపు యూనివర్సిటీ సివమొగ్గ, శ్యాం హిగ్గిన్ బాటమ్ యూనివర్సిటీపై రాయలసీమ యూనివర్సిటీ, కొచ్చిన్ యూనివర్సిటీపై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విజయం సాధించి తదుపరి రౌండ్‌కు అర్హత సాధించాయి. రేగు ఈవెంట్ (ముక్కురు ఆడతారు) నాకౌట్ మ్యాచ్‌లో మొదటి స్థానం పంజాబ్ యూనివర్సిటీ ఆఫ్ చండీగర్, రెండో స్థానం పంజాబ్ యూనివర్సిటీ పటియాలా, మూడో స్థానం యూనివర్సిటీ ఆఫ్ కాలికట్, రాయలసీమ విశ్వవిద్యాలయం సంయుక్త విజేతలుగా నిలిచాయి.

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-ఆలూరు



మద్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఆలూరు పోలీసు సర్కిల్ పరిధిలో మంగళవారం అక్రమ తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని, రెండు బైక్‌లను సీజ్ చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఓబులేసు తెలిపారు. మాచనూరు గ్రామానికి చెందిన ఎర్రగుడి సూరి, ఆలూరు పట్టణానికి చెందిన దలవాయి విజయ్ రెండు బైక్‌లపై ఆలూరు గ్రామ శివారులో 10 బాక్సుల కర్ణాటక మద్యం తరలిస్తుండగా వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి - ఆదోని

భారత ఎన్నికల సంఘం సాధారణ ఎన్నికల షెడ్యూల్ వెలువరించిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ తెలిపారు. మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ ఛాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులతో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలు ఉండగా 26 రూట్ ఆఫీసర్లు, సెక్టోరల్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 2,57,529 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. వీటిలో పురుషులు 1,27,798 మంది, మహిళలు 1,29,682 ఉన్నారని తెలిపారు. హిజ్రాలు 49 మంది ఉన్నారన్నారు. నియోజకవర్గంలో 26 రూట్స్ ఉండగా నలుగురు నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. అందులో అర్బన్ 14, రూరల్ 12 ఉండగా అర్బన్‌లో నోడల్ అధికారులుగా మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌ను నియమించినట్లు చెప్పారు. రూరల్ ఎంపిడిఒ, ఇఒఆర్‌డిని నోడల్ ఆఫీసర్లుగా నియమించినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి)ను పటిష్టంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా సంబంధిత అధికారులను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సీవిజిల్ యాప్‌కు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, మరింత బలోపేతం చేసి యాప్ నుంచి వచ్చే ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంసిసి, ఎఫ్ఎస్‌టి టీమ్‌లు పర్యటిస్తున్నాయన్నారు. ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి టీమ్‌లు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎన్నికల ప్రవర్తన నియమావళిపై వంద శాతం దృష్టి సారించి చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. అన్ని పంచాయతీలు, సచివాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలపై ఉన్న రాజకీయ పార్టీల బ్యానర్లు, పోస్టర్లు, స్టిక్కర్లు, ఫొటోలు, ఇతర క్యాలెండర్లు, జెండాలను, బస్టాండ్, రైల్వే స్టేషన్లలో, రోడ్డుకిరువైపులా, ముఖ్య కూడలి ప్రాంతాల్లోని అన్ని హోర్డింగులను అధికారులు, సంబంధిత ఎఈఆర్‌ఒలు, ఎంపిడిఒలతో మాట్లాడి తొలగించామన్నారు. ఎన్నికల ఖర్చులపై రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై ఎన్నికల వ్యయ అంచనా అధికారులతో కలిసి సబ్ కలెక్టర్ నివృత్తి చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి రూ.40 లక్షల వరకు ఖర్చు చేయవచ్చని, ఖర్చుపై ఆడిటింగ్, మానిటరింగ్ జరుగుతుందని తెలిపారు. తహశీల్దార్ హసీనా సుల్తానా, మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ రామేశ్వర రెడ్డి, ఎంపిడిఒ విజయ్ శేఖర్ రావు, డిఎల్‌పిఒ కార్యాలయపు పరిపాలన అధికారి వీరభద్రప్ప, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

వైభవంగా గోకారమయ్య, బడేసా ఖాద్రీ గంధం వేడుకలు

ప్రజాశక్తి - సిబెళగల్



మండలంలో బురాన్‌దొడ్డి గోకారమయ్య, పలుకుదొడ్డిలో బడేసా ఖాద్రీ ఉరుసు గంధం వేడుకలు మంగళవారం రాత్రి వైభవంగా సాగాయి. ఊరేగింపుగా ఉత్సవాలు చేపట్టగా భక్తులు, భక్తాదులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో బందోబస్తు చేపట్టారు.

మోగిన బార్ అసోసియేషన్ ఎన్నికల నగారా

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని బార్ అసోసియేషన్‌కు ఎన్నికల నగారా మోగింది. మంగళవారం ఆదోనిలోని బార్ అసోసియేషన్‌లో జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో పలువురు సీనియర్ న్యాయవాదులు మాట్లాడారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించిల్సిందేనని చెప్పారు. అంతకుముందు వార్షిక సంవత్సరంలో చేసిన అభివృద్ధి పనులపై నివేదిక చదివి వినిపించారు. కొందరు అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులుగా ఉండేందుకు ప్రతిపాదించడంతో, అనంతరం పూర్వ అధ్యక్షులు వైఆర్.మల్లికార్జున సుందర్ సింగ్‌ను అధ్యక్షులుగా ఉండేందుకు మద్దతు తెలిపారు. మరో సీనియర్ న్యాయవాది దేశాయ్ ఇప్పుడున్న కార్యవర్గ సభ్యులు ఉండేందుకు అవకాశం కల్పించాలని కోరారు. సీనియర్ న్యాయవాది ఖాసీం ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని కోరడంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అనితా బాయి చెప్పారు. సీనియర్ న్యాయవాదులు మన్సూర్ అహ్మద్, విశ్వనాథ్ రెడ్డి, బషీర్ అహ్మద్, నాగేంద్రయ్య, విరుపాక్షి రెడ్డి, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

సంక్షేమ సారథి జగన్‌ను ఆశీర్వదించండి

- వైసిపి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గత ఐదేళ్లుగా అవినీతికి తావు లేకుండా ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను అందించిన సంక్షేమ రథసారథి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డికి మరోసారి మద్దతు ఇచ్చి గెలిపించాలని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక ప్రజలను కోరారు. మంగళవారం పట్టణంలోని 22వ వార్డులో వార్డు కౌన్సిలర్ డిష్ కేశవరెడ్డితో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లి జగన్ పాలనలో అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైసిపిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వ్యాపారులను, ఓటర్లను కలిసి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందని వివరించారు. టిడిపి, జనసేన, బిజెపి ఇచ్చే హామీలను నమ్మి మోసపోవద్దని సూచించారు. టిడిపి అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాల ఊసే ఉండదని హెచ్చరించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే వార్డు పరిధిలో మిగిలిన సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర శాప్ నెట్‌వర్క్ కార్పొరేషన్ ఛైర్మన్ మాచాని వెంకటేష్, వైసిపి పట్టణ అధ్యక్షులు బుట్టా రంగయ్య, పట్టణ అధికార ప్రతినిధి సునీల్ కుమార్, కౌన్సిలర్లు అమాన్, సుధాకర్, ఇన్‌ఛార్జీలు పాల శ్రీనివాసరెడ్డి, విశ్వనాథ, రమేష్, కోటకొండ నరసింహులు, విశ్వనాథ్, తార రాజశేఖర్, రామాంజి రెడ్డి, సోమేష్, చంద్రశేఖర్, నాయకులు మహేశ్వర్ రెడ్డి, మాచాని రఘునాథ్, రామలింగారెడ్డి, డీలర్ మధు, గట్టు ఖాజా, జిఎమ్.బాషా, రజాక్, సురేష్ చౌదరి, ఫయాజ్, ఉబేద్ పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బుట్టా రేణుక

'పది' పరీక్షలో విద్యార్థి డీబార్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో మాల్ ప్రాక్టీసింగ్ పాల్పడుతుండగా విద్యార్థిని డీబార్ చేసినట్లు డిఇఒ కె.శామ్యూల్ మంగళవారం వెల్లడించారు. రెండో రోజు జరిగిన పరీక్షకు 31,637 మంది విద్యార్థులకు గాను 30,807 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. 560 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని తెలిపారు.

ఏడుగురు వాలంటీర్ల తొలగింపు

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని వెముగోడు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఏడుగురు వాలంటీర్లను విధుల నుంచి తొలగించినట్లు ఎంపిడిఒ సోనిబాయి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడారు. ఈనెల 17న వెముగోడు గ్రామంలో 'మేము సిద్ధం - మా బూత్ సిద్ధం' ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని వైసిపి మండల నాయకులు నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామంలోని ఏడుగురు వాలంటీర్లు హాజరైనట్లు గ్రామానికి చెందిన బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ అంపన్న, గ్రామ ప్రజలు ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారని చెప్పారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు సంబంధిత వాలంటీర్లందరూ గ్రామంలోని సచివాలయం వద్ద విచారణకు హాజరు కావాలని పంచాయతీ కార్యదర్శి ద్వారా నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ తాఖీదుల మేరకు ఇఒఆర్‌డి నగేష్ విచారణ జరిపి నివేదిక సమర్పించినట్లు చెప్పారు. ఆ నివేదిక మేరకు సదరు కార్యక్రమంలో పాల్గొన్న బాలకృష్ణారెడ్డి, బాకర్ బీ, అపర్ణ, కామాక్షి, పుష్పావతి, లక్ష్మన్న, మద్దిలేటి అనే ఏడుగురు వాలంటీర్లను విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి సెల్ ఫోన్లు, స్కానర్ డివైజ్‌లు స్వాధీనం చేసుకొని భద్రపరచుకోవాలని పంచాయతీ కార్యదర్శి ఫాతిమాను ఆదేశించినట్లు చెప్పారు.

ముడుమాలలో వేడుకగా గ్రామ దేవర

ప్రజాశక్తి - సిబెళగల్

మండలంలోని ముడుమాలలో మారెమ్మ, సుంకులమ్మ అవ్వ దేవర ఉత్సవాలు మంగళవారం వేడుకగా జరిగాయి. సోమవారం పిండి వంటలతో ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. మంగళవారం పారువేటలో భాగంగా కుంభాలతో వెళ్లారు. దీంతో గ్రామంలో భక్తుల, బంధువుల రాకపోకలతో కిక్కిరిసి పోయింది. ఇక్కడే పలువురు ప్రముఖులు గ్రామాన్ని సందర్శించి అమ్మవార్లకు పూజలు చేయగా సందడి నెలకొంది.

కాంగ్రెస్‌లోకి రామస్వామి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విశ్రాంత స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామస్వామి కాంగ్రెస్ పార్టీలో మంగళవారం చేరారు. మాజీ పిసిసి అధ్యక్షులు శైలజా నాథ్ సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అన్ని విధాలుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. డిసిసి అధ్యక్షులు బాబురావు, కాంగ్రెస్ నాయకులు ఉండవల్లి వెంకటన్న, బతుకన్న, సత్యనారాయణ గుప్తా, అనంతరత్నం ఉన్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న రామస్వామి

అవినీతి, అక్రమాలకు కేరాఫ్ గుమ్మనూరు

- నాపై ఆలూరు టిడిపి నుంచి పోటీ చెయ్ - గుమ్మనూరుకు సవాలు విసిరిన విరుపాక్షి

ప్రజాశక్తి - దేవనకొండ

రాష్ట్ర మాజీ మంత్రి గుమ్మనూరు జయరామ్ అవినీతి అక్రమాలకు కేరాఫ్‌గా మారారని వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ విరుపాక్షి విమర్శించారు. మంగళవారం మండలంలోని పి.కోటకొండ, దుప్పనగుర్తి, నెల్లిబండ, బండగట్టు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పి.కోటకొండ వైసిపి గ్రామ నాయకులు ఇన్‌ఛార్జీ విరుపాక్షికి పూలవర్షం కురిపించి, బాణసంచా కాల్చి ఘన స్వాగతం పలికారు. ఆ గ్రామ రాంబావి ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామస్తుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దమ్ముంటే ఆలూరు టిడిపి నుంచి ఎమ్మెల్యేగా తనపై పోటీ చేయాలని గుమ్మనూరు జయరామ్‌కు సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. పి.కోటకొండ గ్రామ బస్ స్టేజి నుంచి బేతపల్లి గ్రామం వరకు అధ్వానస్థితిలో ఉన్న రోడ్డు నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆలూరు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు తెర్నేకల్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో గెలిపించుకుంటేనే సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగుతాయని, లేకుంటే అన్ని సంక్షేమ పథకాలు రద్దవుతాయని తెలిపారు. మరోసారి వైసిపి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ మద్దతు తెలిపాలని కోరారు. వైసిపి సీనియర్ నాయకులు, వైసిపి జిల్లా కోశాధికారి మధుసూదన్ రెడ్డి, ఎంపిపి భర్త లుముంబా, వైసిపి మండల కన్వీనర్ తపాల శ్రీనివాసులు, నాయకులు దివాకర్ నాయుడు, నీలకంఠప్ప, ఎంపిటిసి రంగడు, మీనుగా కృష్ణ, రామచంద్ర, లక్ష్మణ స్వామి, రామానాయుడు పాల్గొన్నారు.



పి.కోటకొండ గ్రామంలో మాట్లాడుతున్న విరుపాక్షి

పోతుగల్లులో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి - క్రిష్ణగిరి

క్రిష్ణగిరి మండలం పోతుగల్లు గ్రామంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ'లో కార్యక్రమంలో మంగళవారం పర్యటించారు. టిడిపి కర్నూలు జిల్లా పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఆలంకొండ నబి సాహెబ్, టిడిపి క్రిష్ణగిరి మండల అధ్యక్షులు కటారు కొండ మర్రి రాములు ముఖ్యఅతిథులుగా హాజరై పోతుగల్లు గ్రామంలో స్థానిక బిల్డింగ్ కాలనీలో పర్యటించారు. వారు ఇంటింటికీ తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి, అధినేత చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలిపారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు కోసం టిడిపికి ఓటు వేసి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1500, చదువుకునే పిల్లలకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15 వేలు, ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు, నిరుద్యోగులకు యువగళం నిధి నుంచి నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి, ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ప్రజలకు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఎస్సీ, ఎస్టీ, బీసీలపై దాడులు ఎక్కువయ్యాయని తెలిపారు. టిడిపి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాల్లో చెప్పిన విధంగా రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రాగానే బీసీలకు, బడుగు, బలహీన వర్గాలకు రక్షణ కల్పించే చట్టాలు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ బాగా కష్టపడి వచ్చే ఎన్నికల్లో టిడిపిని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. టిడిపి మండల కార్యదర్శి యు.గురుస్వామి, తెలుగు యువత అధ్యక్షులు రఫీ, టిడిపి పోతుగల్లు గ్రామం నాయకులు సోమలింగన్న గౌడ్, శివ గౌడ్, ధూపాటి నడిపి మద్దిలేటి, రామాంజనేయులు, కప్పు లింగడు, ఆంజనేయ, చిన్న కౌలుట్ల, నాగేష్, నాగేంద్ర, దుబ్బ లింగన్న, బాలగిడ్డి, బికె.మధు, ఈశ్వర్, తెలుగు పెద్ద రంగన్న, టిడిపి మల్లాపురం నాయకులు బ్రహ్మయ్య, శ్రీరాములు, వెంకటస్వామి, వెంకటరాముడు పాల్గొన్నారు.



పథకాలను వివరిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి సూపర్ సిక్స్ పథకాలతో లబ్ధి

- టిడిపి యువ నాయకులు సూరి

ప్రజాశక్తి - నందవరం



ప్రచారం చేస్తున్న టిడిపి యువ నాయకులు సూరి

టిడిపి ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరుతుందని టిడిపి యువ నాయకులు గొల్ల సూరి, గొల్ల సోమన్న తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్దకొత్తిలి గ్రామంలో ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు పెద్దకొత్తిలి గ్రామంలో ప్రతి ఇంటికీ పథకాలను చేరవేసేందుకు ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలో గ్రామాలు అభివృద్ధి పథంలో నడిచాయని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే బీవీ కూడా గ్రామాల్లో సమస్య ఉందని చెబితే, వెంటనే ఎమ్మెల్యే నిధులు కేటాయించి గ్రామాల అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికీ ఏయే లబ్ధి చేకూరుతుందో తెలియజేసి, టిడిపి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ రెండు ఉంటాయని చెప్పారు. అందుకోసం ప్రతి ఒక్కరూ టిడిపికి ఓటు వేసి బీవీని మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించి, మంత్రిగా చూసేందుకు ప్రతి కార్యకర్త నిరంతర కృషి చేయాలని కోరారు. టిడిపి గ్రామ సీనియర్ నాయకులు రామకృష్ణ, చాకలి రాముడు, చిన్న సోమన్న, బసవ రాజు, బక్సర్, వెంకటేష్ పాల్గొన్నారు.

విచ్చలవిడిగా గుట్కా అమ్మకాలు...

- గుట్కాకు బానిసలై అనారోగ్యం పాలవుతున్న యువకులు - చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుంద మండలంలో గుట్కా ప్యాకెట్ల అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. గుట్కాకు బానిసలై యువకులు అనారోగ్యం పాలవుతున్నారు. గుట్కా ప్యాకెట్ల అమ్మకాలను అరికట్టాల్సిన సంబంధిత అధికారులు చోద్యం చేస్తున్నారు.

హోళగుంద నుంచి 5 కిలోమీటర్ల దూరంలో కర్ణాటక సరిహద్దు ఉండడంతో అధిక సంఖ్యలో గుట్కా ప్యాకెట్ల రవాణా జరుగుతున్నట్లు సమాచారం. ఇక్కడ ఏ దుకాణానికి వెళ్లినా తాగడానికి నీరు దొరుకుతుందో, లేదో కానీ గుట్కా ప్యాకెట్లు మాత్రం దర్శనమిస్తాయి. అధికారులకు తెలిసినా తూతూమంత్రంగా దాడులు నిర్వహించి అక్కడక్కడ 1, 2 కేసులు కట్టి చేతులు దులుపుకుంటున్నట్లు మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. గుట్కా ప్యాకెట్ల అమ్మకాల వల్ల వ్యాపారులకు అధిక సంఖ్యలో లాభాలు వస్తున్నా, ఎక్కువ శాతం కార్మికులు, యువకులతో పాటు యువతులు, మధ్య తరగతి మహిళలు సైతం బానిసైనట్లు తెలిసింది. నోటి క్యాన్సర్‌తోపాటు రక్తహీనత, మతిస్థిమితం కోల్పోవడం వంటి సమస్యలు వచ్చి చేరుతున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నా యువత పెడచెవిన పెడుతున్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి 30 గుట్కా సీట్లు గల ఒక బాక్స్‌ను రూ.100 ప్రకారం కొనుగోలు చేసి రూ.150 నుంచి రూ.200 వరకు వ్యాపారులు అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.



రాష్ట్రాల మధ్య కఠిన చర్యల అమలులో తేడాలు

గుట్కా, మత్తు పదార్థాల కార్యకలాపాలపై కఠిన చర్యలు అమలు చేయడంలో రాష్ట్రాల మధ్య తేడాలు ఉండడం వల్ల గుట్కా, మత్తు పదార్థాల అమ్మకందారులు చెలరేగిపోతున్నట్లు సమాచారం. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆదాయమే ధ్యేయంగా పని చేయడం, ఒక రాష్ట్రం గుట్కా అమ్మకాలు చట్ట విరుద్ధం, నిషేధమంటూ ఆదేశాలు జారీ చేస్తున్నాయి. మరో రాష్ట్రం గుట్కా, మత్తు పదార్థాల వల్ల అధిక లాభాలు ఆర్జించవచ్చని భావించడం వల్ల యువతతో పాటు మహిళలు కూడా అనారోగ్యం పాలవుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

ఏ రాష్ట్రం కూడా గుట్కా, మత్తు పదార్థాలను అమ్మి లాభాలను ఆర్జించకూడదని కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. పక్కన కర్ణాటక రాష్ట్రంలో గుట్కా ప్యాకెట్లు అమ్ముకోవచ్చని ఆదేశించడం వల్ల బహిరంగంగా మార్కెట్‌లో అమ్మకాలు జరుగుతున్నాయి. ఆంధ్ర రాష్ట్రంలో గుట్కా, మత్తు పదార్థాలు నిషేధించడం వల్ల రహస్యంగా అమ్మకాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుట్కా వ్యాపారులపై ఉక్కు పాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.